అనామకుడు

'ఏమండోయ్ రంగనాధంగారూ! బహుకాలదర్శనం. బావున్నారా?'

'అయ్యా నరహరీ! ఎప్పుడొచ్చావు బాబూ! ఇందాకా నిన్ను గురించే అనుకున్నాం. అన్నట్టు నువ్వొక్కడివేనా వచ్చింది?'

'ఒరేయ్ గోపీ! ఇదేనా రావడం? టిఫిన్లింకా పెడుతూనే వున్నారు. వెళ్ళు... వెళ్ళు...'

'రాధాపతీ! మెల్లగా దిగరా నాన్నా! అసలీ మధ్య ఒళ్ళు చేసినట్టున్నావు. నీళ్ల పంపుల దగ్గర జాగ్రత్త! కాలుజారి ఎవరిపైనయినా పడ్డావో ప్రమాదం...'

పలకరింపులతో పరామర్శలతో పందిరి క్రింద సందడిగా వుంది. హారన్లు మ్రోగించుకుంటూ కార్లు, గంటలు వాయించుకుంటూ రిక్షాలు, గుర్రపుడెక్కల చప్పుళ్ళతో జట్కాలు, ప్రతి నిమిషమూ ఏదో ఒక వాహనం వచ్చి పందిరి ఎదుట విడిసిపోతోంది. ఎవరొచ్చింది, ఎవరొచ్చింది అన్నట్టుగా చూపులన్నీ కొద్ది క్షణాలపాటు ఒక్కుమ్మడిగా ఆ వచ్చి నిలిచిన వాహనంవైపు ప్రసరిస్తున్నాయి. కొత్తగా కొన్న పాతకారులోంచి దిగి మునిసిపల్ కౌన్సిలరు మేఘనాధంగారు యింతకుమునుపే లోపలికి వెళ్ళారు. ఆ కారుకు అల్లంతదూరంలో ఆగివున్న స్కూటరు ఇన్‌కమ్‌టాక్సు ఆఫీసరు శ్రీధరమూర్తిగారిది. అదిగో, ఆ చెట్టు క్రింద పదిమంది మిత్రులతో పరివేష్టితుడై తీవ్రంగా ఏదో చర్చలో నిమగ్నుడైవున్న వ్యక్తి భూపతి. అతడు థియేటర్ యజమాని. వీళ్లుకాదు పరకాయించిచూస్తే యింకా యిలాంటి వాళ్లెందరో అక్కడున్నారు. ఉండడంలో ఆశ్చర్యమేమీలేదు. జగన్నాధంగారు ఏకైకపుత్రికకు పెళ్లి చేస్తున్నారు. ఆయన స్వహస్తంతో టౌనులో పంచి పెట్టిన ఆహ్వానపత్రాలే అయిదువందలదాకా వుంటాయి. అంతకు రెండింతల పత్రికలు పోస్టులో వెళ్లాయి. జగన్నాధంగారికి భూములున్నాయి. భారీ వ్యాపారాల్లో వాటాలున్నాయి. ఆఫీసుల్లో పలుకుబడివుంది. ప్రముఖులతో పరిచయంవుంది. జగన్నాధంగారి కిన్ని హంగులుండడంవల్ల అది ఆ ప్రాంతంలో చాలామందికి పిలవకపోయినా వెళ్లవలసిన పేరంటమైపోయింది. ఇక పిలుపందుకున్న బంధుమిత్రులు తండాలు తండాలుగా తరలిరావడంలో ఆశ్చర్యమేముంది?

పెళ్లికుమార్తె ప్రసూన యింకా కాలేజీలో చదువుకుంటూవుంది. పెళ్లయిన తరువాత ఆమె చదువుకోడానికి పెళ్ళికుమారుడు అభ్యంతరమేమీ చెప్పలేదు. ఆ మాటకొస్తే ఆమె జీవితాంతందాకా చదువుకుంటూ వుండిపోయినా తనకేమీ అసౌకర్యం వుండదన్నాడు. ఏప్రిల్లో యంఎస్సీ పరీక్షలు వ్రాసి మే నెల్లో పెళ్లి చేసుకుంటున్న సీతాపతికి మాత్రం చదువులపట్ల ధ్యాస వెనుకముఖం పట్టిందనే చెప్పాలి. ఏ సిద్ధినైతే లక్ష్యంగా పెట్టుకుని తానింతకాలం విద్యాసాధన చేశాడో అది ఈ పెళ్ళిద్వారా సగానికిపైగా సిద్ధించినట్లయింది. ఇప్పుడిక ఉద్యోగం చేసి తీరాలన్న నిర్బంధం లేదు. 'కానీ చూద్దాం' అనుకుంటున్నాడు సీతాపతి. నచ్చిన ఉద్యోగమంటూ దొరికితే కొంతకాలంపాటు చేసి చూడొచ్చు. మనస్కరించకపోతే చిరుగులుపడ్డ చేతిగుడ్డను గిరవాటు పెట్టినట్లుగా రాజీనామా వ్రాసి పడెయ్యనూ వచ్చు.

పెళ్లికి ప్రసూన స్నేహితురాళ్లు చాలామంది వచ్చారు. ఆ కాలేజీలో లెక్చరర్లుగూడా విచ్చేశారు. అందువల్ల ఆధునిక నాగరిక ప్రపంచంలో ఆడవాళ్ల ఆహార్యపు తీరుతెన్నుల్లో వచ్చిన వింత వింత సొబగులన్నింటినీ ఒక్కసారిగా సంతకు తోలుకొచ్చినట్టుగా ఆ వివాహ దృశ్యానికెక్కడలేని కాంతి వచ్చేసింది. ఈ విషయంలో వరుడైనా నిస్సహాయంగా లేడు. అతడి బలగంగూడా దండిగానే వచ్చింది. నవ్వులు, కేరింతలు, వాగ్యుద్ధాలు, సిగరెట్ల పొగలు ఎక్కడైతే దట్టంగా వ్యాపించి వున్నాయో అక్కడల్లా కాలేజీ కుర్రాళ్ళు గుమికూడి వున్నారని ఆవైపు చూడకపోయినా తెలిసిపోతోంది.

ఏమైనా పెళ్లికి వచ్చిన జనంలో మరింత వైవిధ్యం కన్పించడానికి తోడ్పడింది మాత్రం జగన్నాథంగారి బంధువర్గమే! నలుగురన్నదమ్ముళ్లాయనకు. వాళ్లుగూడా నేల నాలుగు చెరగులా నాటిన నాలుగు జయస్తంభాలలాంటి వాళ్లు. ఒకతను మిలటరీ కార్యాలయంలో ఉన్నతోద్యోగి. తమ్ముడేమో ఐ.ఎ.ఎఫ్.లో వుండి నెలనెలా రెండువేల రూపాయలు పుచ్చుకుంటున్నాడు. అన్నగారు బాంబేలో హోటలు నడుపుతూ అక్కడే స్థిరపడ్డారు. పోగా జగన్నాథంగారి భార్యకు అన్నదమ్ముడైతే ఒక్కడేగానీ అక్కచెల్లెళ్లు అయిదుగురు. ఒకావిడ ఇంజనీరును పెళ్లాడి అతడితో బాటుగా అమెరికావెళ్లి రెండేళ్ళుండి యిటీవలే తిరిగొచ్చింది. ఇంకొకావిడ డాక్టరు. ఆమె మొగుడూ డాక్టరే! మిగిలిన వాళ్లల్లో యిద్దరికి లెక్చరర్లకూ పెళ్లాలయ్యే యోగం పట్టింది. కడగొట్టు చెల్లెలి మొగుడు మాత్రం ఏకంగా శాసనసభలోనే సభ్యుడు. ఇప్పుడు పేర్కొన్న బంధువుల్లో చాలామందికి పెళ్ళిళ్లయిన కొడుకులూ, కూతుళ్లూ వున్నారు. ఆ రెండోతరంవాళ్లకు మళ్లీ బిడ్డలున్నారు. జగన్నాథంగారి కెలాగూ ఐశ్వర్యానికి తగ్గ నిష్పత్తిలో సంతానం కలగలేదు. భగవంతుడి కామాత్రం వితరణ లేకపోయింది. అందుకు బంధువులేం చేయగలరు పాపం! వాళ్లూ ఎంతోకాలంనుంచీ వేచివున్నారు. లేకలేక యిన్నాళ్లకు జగన్నాథంగారి యింట్లో ఒక శుభకార్యం ఒనగూడింది. దీన్ని కాస్తా జారవిడిస్తే మళ్లీ పాతికేళ్లదాకా యిలాంటి అవకాశం యింకొకటి లభించకపోవచ్చు. అందువల్ల వాళ్లు సకుటుంబంగా మరికొందరైతే మిత్రసమేతంగా, యింకా కొందరు పరివారసహితంగా పెళ్లికి తరలి వచ్చేశారు.

కామాక్షీ కల్యాణ మహల్ సినిమాథియేటరు గాదు. లేకుంటే ఈపాటికెప్పుడో హౌస్‌ఫుల్ అన్న బోర్డు తగిలించివుండవలసింది!

హాల్లో పెళ్లి మండపం ఎదుట వేసిన అయిదు వందల కుర్చీలు భర్తీ అయిపోయాయి. ఇంకా చాలామంది ఎక్కడివాళ్లక్కడే నిలబడిపోయివున్నారు. ముహూర్త సమయానికి అట్టే వ్యవధిగూడా లేదు. ఇంకొక అయిదువందల కుర్చీలకోసం మనుషులు పరుగెడుతున్నారు.

ముఖంపైన క్రమ్ముకుంటున్న చిరుచెమటను అంగవస్త్రంతో తుడుచుకుంటూ జగన్నాథంగారు ఆదరాబాదరాగా పాకశాలవైపు పరుగుతీశారు.

ట్రిచీనుంచి వచ్చిన వంట బ్రాహ్మల జట్టుకు నాయకుడు నటేశయ్యరు కుర్చీలో సుఖోపవిష్టుడై, నోటినిండుకూ తాంబూలం పట్టించి దానికి మద్దతుగా అప్పటికప్పుడే గంపెడు తంగభస్మం దట్టిస్తున్నాడు.

"అయ్యరుగారూ! అంచనా తారుమారైపోయేటట్టుంది. ముహూర్తం కాగానే కొందరు తాంబూలాలు పుచ్చుకుని వెళ్లి పోవచ్చుననుకోండి! కానీ నిలిచిపోయేవాళ్ల పర్సంటేజ్ ఎక్కువగా ఉంటుంది. మీరిప్పుడు చేస్తున్నది వెయ్యిమందికోసం. అవసరమైతే యింకొక అయిదువందల మందికిగూడా..."

"అదేయప్పా! మీరూరుకొండిసార్! ఇక్కడ అదుపులమీద అండాలు మండుతుదా వుండును. అక్కడ అన్నాలు తినడందా ఆలస్యం, యిక్కడ అన్నాలు దిగుతూదా వుండును. మీకు కవలెందుకు సార్! పొండి, పొండి. మీ వేలె మీరు సూసుకొండి..."

అయ్యరుగారి అభయ ప్రదానంతో ప్రాణాలు తెరిపిన పడ్డట్టయింది జగన్నాథం గారికి!

సరిగ్గా ఆ క్షణంలోనే వెనుకవైపునుంచీ ఓ చేయి జగన్నాథంగారి భుజంపైన పడింది.

కంగారుపడిపోతూ ఆయన వెనుదిరిగి చూచేసరికి హనుమంతప్ప కనిపించాడు.

"ఏమిటండీ అన్నగారూ! ఏం జరిగింది"

"ఇప్పటికేమీ జరగలేదులే! రా, చెబుతాను..."

స్తంభం చాటుకు లాక్కెళ్లాడు హనుమంతప్ప.

"చూడవోయ్ జగన్నాథం! నీకూ యాభై యేళ్లు వచ్చేశాయనుకో! కానీ అదేమంత పెద్ద వయసుగాదు. సభలూ, సమావేశాలూ, బిజినెస్సులూ వగైరా నువ్వు బోలెడన్ని జరిపించి వున్నావు. ఐనా పెళ్లి సంగతి వేరు. అందులోనూ కామాక్షీ కల్యాణ మహల్లో పెళ్లి జరగడమాయె! ఇదసలే మాయామహలు. ఏమూల ఏం జరుగుతున్నదీ మనం తెలుసుకోలేం. పోగా యిక్కడ మామూలుగా జరిగిపోయే తెరమరుగు వ్యవహారం ఒకటుంది..."

"అలాగా! అదేమిటో మీరే చెప్పాలి. పెద్దలు మీరుండడం అందుకే గదా!"

తన పెద్దరికం తనకు దక్కినందుకు హనుమంతప్ప ముఖంలో సంతృప్తి తాండవించింది.

"పెళ్ళికి చాలామంది వచ్చారు. అవునా జగన్నాథం?"

ఇందులో అభిప్రాయ భేదానికి తావెక్కడిదన్నట్టు జగన్నాథంగారు తలపంకించారు.

"వస్తారు, వస్తారు. ఎందుకురారు! గరిట చేతబట్టుకుని విశ్వమోహిని అమృతం వడ్డిస్తున్నానహో అనే సరికి దేవతలంతటి వాళ్లు బారులు తీర్చి కూర్చోలేదా? ఐతే ఒకటి. ఆ అయ్యలు కూచోవలసిందే! ఆయమ్మ వడ్డించనూ వలసిందే! కానీ రాహు కేతువుల మాటేమిటి? ముఖం చాటు చేసుకుని, చేతుల్నిమాత్రం పొడుగ్గా చాచుకుని బంతిలో బైటాయించిన రాహుకేతువుల్ని మాత్రం ఏ బుద్ధిమంతుడూ కనిపెట్టలేదే!"

"అవు న్నిజమేనండీ అన్నగారూ! ఎందుకైనా మంచిది. మనం ఓ కంట కనిపెట్టి వుందాం లెండి!"

"అదీ, ఆ హుషారు చాలా అవసరం! దారంట వెళ్లే దానయ్యలు చాలామంది వున్నారయ్యా లోకంలో. పైగా యిక్కడి సత్రాల్లో అరుగులపైన పస్తులుమాడే బైరాగులు

బోలెడుమంది! వచ్చిన చిక్కెక్కడుందంటే, వీళ్లు చూడ్డానికి బైరాగుల్లా వుండరు. మామూలు మనుషుల్లా వుంటారు. ఇలాంటి పెళ్లిళ్లు జరిగాయంటే వాళ్లకు పండగ! ఒక మాదిరి వుతికిన బట్టలు తొడుక్కుంటారు. ముఖం శుభ్రంగా గీక్కుంటారు. చడీచప్పుడూ లేకుండా పెళ్ళివిడిదిలోకి వచ్చేస్తారు. పెళ్లివాళ్లతో కలిసిపోతారు. సర్కారెరువూ, చక్కెరా కలిసినట్టే! నోట్లో వేసుకుంటేగానీ రుచి తెలియదు..."

"అవునవును. మీరు చెప్పేశారుగా! ఇక మన జాగ్రత్తలో మనముందాంలెండి!"

"ఎందుకు చెబుతున్నానంటే జగన్నాథం, నిరుడిలాంటప్పుడు బెంగుళూరులో నా తోడల్లుడికూతురు పెళ్లి జరిగింది. మనోరంజనీ కళ్యాణమందిరం అని నువ్వూ వినేవుంటావు. జరిగితే ఏమైంది? పెళ్లికుమార్తె సూట్‌కేసు కనిపించలేదంతే! కొత్త చీరలు, నగలు అంతా కలిసి యిరవైవేల రూపాయల సరుకు! తెల్లారేసరికి క్లోస్..."

అసలీ హనుమంతప్ప ధూమకేతువులాంటివాడని జగన్నాథంగారికి తెలుసు! తోకచుక్క కనిపిస్తే దేశాని కరిష్టమట! తరతరాల విశ్వాసంకదా అని వూరుకోకుండా శాస్త్రజ్ఞులు దీన్ని మూఢ విశ్వాసంక్రింద జమకట్టారనుకోండి! కానీ ఎటొచ్చీ పులికంటే గిలే హెచ్చు! జరగబోయే ప్రమాదంకన్నా (బహుశా అది జరగకనే పోవచ్చు) హనుమంతప్ప చేసే ప్రమాదసూచనవల్లనే ఒళ్లు జలదరిస్తుంది.

హనుమంతప్పను తప్పించుకుని జగన్నాథంగారు మళ్లీ పెళ్లి జరుగుతున్న హాల్లోకి వచ్చేశారు.

పూలపల్లకీలా అలంకరించిన మండపంలో పురోహితుడు ముహూర్త ధారణప్పుడు కావలసిన వస్తు సామాగ్రిని ఓమూలగా పేర్చి పెట్టుకుంటున్నాడు.

పెళ్లి ఏర్పాట్లపైన తాము నియమించిన వలంటీర్లు కొందరు అప్పుడే తీసుకొచ్చి వేసిన కుర్చీలలోకి అతిథుల్ని సర్దుతున్నారు.

'గంట తొమ్మిది కావస్తోందండీ శాస్త్రిగారూ! టంచనుగా పదికొట్టేసరికల్లా సూత్రధారణ జరిగిపోవాలి'– ఒక పెళ్లి పెద్ద హెచ్చరిక చేస్తున్నాడు.

కానీ అతిథిసత్తముల కెవరికీ ఆ ఆదుర్దా వున్నట్టు లేదు. సూత్రధారణ జరిగేదీ జరగకపొయ్యేదీ, మంగళవాద్యాలు మ్రోగేదీ మ్రోగకపోయేదీ, పురోహితుడి మంత్రాలు వినిపించేదీ వినిపించకపోయేదీ, ఈ గొడవేదీ వాళ్లకు కాబట్టలేదు. వేళకు సరిగ్గా తమ అవసరాలు తీరిపోతుండే పక్షంలో వాళ్ళు ఎంత కాలమైనా యిక్కడుండి కులాసా కాలక్షేపంచేసి వెళ్లే ధోరణిలో వున్నారు. జగన్నాథంగారికి కాస్తా చిరాకు పుట్టుకొచ్చినమాట నిజం! కుర్చీలు చూపించినా వీళ్లు కూచోరు. అందుకిదే సందర్భమైనట్టు సినిమాలపైన, రాజకీయాలపైన ఏకధాటీగా ప్రసంగాలు కొనసాగిస్తారు. బహిరంగ సభలలోనైనా డిసిప్లిన్ మెయింటెయిన్ చెయ్యవచ్చునేమోగానీ, పెళ్లిళ్లలో అది సాధ్యమయ్యేటట్టులేదు...

అప్పుడొక చిన్న సంఘటన జగన్నాథంగారి కంటబడింది. ఎవడో ఒక అపరిచిత వ్యక్తి ఖాళీకుర్చీ ఒకటి వెదికిపట్టి, అందులో కూచోబోతుండగా ఎవరో దాన్ని వెనక్కు లాగేశారు. జాగరూకుడుగా వుండబట్టి సరిపోయిందిగాని లేకుంటే అతడు దబేలున నేలపైన పడిపోయి వుండవలసిందే! నిలవరించుకుని అతడు తిరిగి చూసేసరికి ఒళ్లంతా

పాంటుగా, కోటుగావున్న ఒక పెద్ద మనిషి ఆ కుర్చీలో ఆసీనుడై వున్నాడు. సంఘటన చిన్నదే అయినా ఆ స్థాయిలో అక్కడొక చిన్న రగడ జరిగి వుండవలసింది. కానీ ఆ వ్యక్తి పెదవి కదలకుండా తనపాటుకు తాను దూరంగా వెళ్ళిపోయి కిటికీ దగ్గర నిల్చుండిపోయాడు.

జగన్నాథంగారికి ఆ అపరిచితవ్యక్తిపట్ల యించుక సానుభూతి కలుగకపోలేదు. కానీ హనుమంతప్ప చేసివున్న హెచ్చరిక మూలంగా ఆ సానుభూతి కొద్ది క్షణాల్లో అనుమానంగా మారిపోయింది. తాను కూర్చునేదాకా వచ్చిన కుర్చీని దురాక్రమణ చేసిన వ్యక్తిపైన కించన్మాత్రంగానైనా కోపం రాలేదంటే యితడీ పెళ్లివేడుక పాలిటికి రాహువు లాంటివాడే అయివుండాలి. ఇందులో పాల్గొనడానికి ఏమాత్రం చొరవగలిగి వుండినా అతడు ఆత్మాభిమానాన్ని చంపుకుని దూరంగా వెళ్లిపోవడం జరగదు. ఐనా యిప్పటికి మించిపోయిందేమీ లేదు. గణితశాస్త్రంలో తెలియని రాసిన 'ఎక్స్' అనుకోవడం పరిపాటి. ఆ లెక్కన యితణ్ణి తాత్కాలికంగా ఎక్స్ అనుకోవచ్చు. పెళ్లి ముగిసేలోగా ఈ ఎక్స్ ఎవడయిందీ ఆరా తీయాలి...

తొమ్మిదిన్నరకు మంగళవాద్యాలు మ్రోగసాగాయి. రేపు పరీక్షలనగా బుద్ధిగా చదువుకోడానికి కూర్చునే కుర్రాళ్ళకు మల్లే బంధుమిత్రులందరూ హాల్లో తావుచేసుకుని కూచున్నారు. సకాలంలో సూత్రధారణగూడా జరిగిపోయింది. ఆ అవకాశంకోసమే వేచివున్నట్టుగా యువకులిద్దరు తటాలున లేచి నిల్చున్నారు. వాళ్ల చేతుల్లో రంగురంగుల కాగితాలున్నాయి. పంచరత్నాలు వ్రాసి తెచ్చిన యువకవి వోవైపున పెద్ద గొంతుకతో వాటిని చదువుతుండగా మరోవైపున ఈ యువకుడు కాగితాలను పంచిపెట్టసాగాడు. ఆ మాత్రం సంఘటనకే సభలో ఓ మూలనుంచీ పెద్దగా కలకలం ప్రారంభమైంది. ఊరుకోం దూరుకోండని చేతితోనే సంజ్ఞచేస్తే జగన్నాథంగారు సందడి చెలరేగుతున్న చోటికి దగ్గరగా వచ్చేశారు. అప్పుడొకచోట నేలపైన దండిగా మూగి వున్న పాదరక్షల నడుమ రెండోసారి మళ్ళీ ఎక్స్ ఆయనకు కానవచ్చాడు. కనిపించడంకన్నా అత డే స్థితిలో కనిపించాడన్నదే యిక్కడ ముఖ్యం. ఆశీర్వాద పద్యాల కాగితంకోసం అతడు చేతిని చాచాడు. యువకుడొక కాగితం ఆ చేతిలోపెట్టి, తీరా పెట్టిన తర్వాత తల పైకెత్తి ఆ ముఖంలోకి చూచాడు. పద్యాలు చదవగలిగిన పరిజ్ఞానం ఆ ముఖంలో కనిపించలేదేమో, అతడు వెంటనే ఆ కాగితాన్ని కాస్తా లాక్కోబోయాడు. అవతలివ్యక్తిగూడా వీలయినంత గట్టిగానే పట్టుకున్నాడేమో, యువకుడు వూడలాగుకోజూడడంలో అది సర్రున ఏటవాలుగా చిరిగిపోయింది. సగం ముక్క మాత్రమే చేతిలో మిగిలింది. ఆ ముక్కవైపు బిక్కుబిక్కుమంటూ చూస్తున్న ఎక్సే జగన్నాథంగారికి కనిపించింది!

'అయ్యోపాపం' అనుకున్నారు జగన్నాథంగారు. ఎంతగా దండగతిండికోసం వచ్చినవాడైనా అతడికిలాంటి పరాభవంమాత్రం జరగగూడదు!

ఆ తిండి తింటున్నప్పుడు అతడి వాలకాన్ని గమనించే అవకాశం సైతం జగన్నాథంగారికి లభించకపోలేదు. ఒక్కొక్కసారి నాలుగువందలమందికి చొప్పున మూడుసార్లు వడ్డించిన తర్వాత రద్దీ తగ్గింది. నాలుగోసారికి డైనింగుహాల్లో సగం కుర్చీలు

ఖాళీగా వుండిపోయాయి. 'నాకూ నాలుగు మెతుకులు వడ్డించండి' అంటూ ఓ కుర్చీలో శరీరం చేరవేసిన జగన్నాథంగారికి నేరుగా అటువైపునవున్న వరుసలో ఓ కుర్చీలో కూర్చుని ఏ పదార్థాన్నిగానీ ఆవురావురని తినేయకుండా చేతివ్రేళ్లతో అన్నాన్ని కెలుకుతూన్న ఎక్స్ కనిపించాడు.

ఒకటికి రెండు అనుమానాలు బిగ్గరగా పట్టేసుకున్నాయి జగన్నాథంగారిని! తిండి బొత్తిగా సయించడంలేదంటే యితడు రెండోసారిఅయినా మళ్లీ తిండికోసం సిద్ధపడి వచ్చివుండాలి. లేదా తిండికంటే మించిన గొప్ప ప్రయోజనం దేనికోసమో ఈ పెళ్లివిడిదిలో పొంచివున్నవాడైనా కావాలి...

నిజం నిజం! జాగ్రత్త చాలా అవసరం. నిజాన్ని నిలకడమీదనే గ్రహించాలి.

అతిథులకు వట్టినోటివిందు మాత్రమే కాకుండా కొంత కనులవిందు, వీనుల విందుగూడా కలిగేటట్లు జగన్నాథంగారు వివాహ కార్యక్రమాన్ని రూపొందించారు. ఆనాటి రాత్రి ఎనిమిదేళ్ల అమ్మాయి ఒకతె చేసిన భరతనాట్యాన్ని వీక్షించడంకోసం పురప్రముఖులు చాలామంది విచ్చేశారు. ఆ తరువాత ఒక చిన్న పాట కచ్చేరిగూడా ముగిసేసరికి గంట పది కావచ్చింది. మధ్యాహ్నం తిన్న ముహూర్త భోజనాలు అప్పుడే ఎలా అరిగిపోయాయో గానీ, అతిథులు మళ్లీ భోజనాలకు తయారు! నిర్వాహకుడికొక్కడికి తప్పితే మిగిలిన వాళ్ళకందరికీ పెళ్ళిళ్లు హాయిగా వుంటాయి కాబోలుననుకున్నారు జగన్నాథంగారు. అందరినీ భోజనాలకు వెళ్లమన్నారు. భోజనంచేసి వచ్చినవాళ్లను తాంబూలం వేసుకోమన్నారు. తాంబూల చర్వణం చేస్తున్నవాళ్లను వెళ్లి యిష్టమైన చోట పడుకోమన్నారు. ఆ వేళప్పుడు అన్నమేం దిగుతుందని కొద్దిగా ఉపాహారం మాత్రం తీసుకున్నారు.

గంట పన్నెండు!

గదిలోకి వెళ్లి పడుకోవడమొక్కటేగాని జగన్నాథంగారికి నిద్రపట్టనేలేదు. కానీ యిప్పుడాయనకు ఎంతో ఆనందంగా వున్నమాట వాస్తవం. భుజాలపైన్నుంచీ కొండంత బరువును క్రిందికి దించి వేసుకున్నట్టుంది. పెళ్లి అనేది వ్యక్తిగత విషయం. పెళ్లి జరగడంలో తప్పితే పెళ్లికొడుకును ఎన్నుకోడంలో తన బాధ్యతేమీ లేదు. నెలరోజులకు మునుపు సీతాపతి ఎవరో తనకు తెలియదు. ప్రసూన కతడితో రెండేళ్ల సుదీర్ఘ పరిచయం వుందట! ఒకరినొకరు అర్థం చేసుకున్న తర్వాత తీసుకున్న నిర్ణయమే! కుర్రాడు బాగున్నాడు. బాగా చదువుకున్నాడు. బస్. తనకంతే కావలసింది.

అలాగని తానీ విషయంలో యిల్లాలి అభిప్రాయాన్ని లెక్కకు తీసుకోకపోలేదు. నిజానికి ఈ సంబంధాన్ని ప్రతిపాదించింది ఆవిడే! బలపరచడం మాత్రమే తన వంతయిపోయింది. ఈడూజోడూ ఎంతో బాగుందట! అబ్బాయి, అమ్మాయి జంటగా ముందు నడచి వెళ్తున్నప్పుడు వెనకనుంచి చూడ్డానికి వెయ్యి కళ్లు కావలసి వస్తాయట! ఆడవాళ్ల దృష్టిలో అల్లుడనిపించుకోదగ్గ మానవుడికి యింతకుమించిన అర్హత అక్కర్లేదేమో!

ఒక ఆడబిడ్డకు వివాహ సంబంధం కుదర్చాలంటే మునుపు ఏడుజతల జోళ్లరిగిపోయేవట!

కాలేజీ లెక్కువై అబ్బాయిలు అమ్మాయిలు పరస్పరం ప్రేమించుకోడమంటూ ఒకటి ప్రారంభమైన తర్వాత యిప్పుడా బెడద చాలావరకు తగ్గిపోయినట్టే వుంది...

జగన్నాథంగారి పెదవులపైన లీలగా ఒక లేవగపు మెరిసింది.

గంట నాలుగు కొట్టేటప్పటికి జగన్నాథంగారికో విషయం జ్ఞప్తికి వచ్చింది. సింహద్వారం దగ్గర పోలుగాణ్ణి కాపుండమని చెప్పినట్టే గుర్తు. ఉన్నాడో లేదో? ఒకవేళ పనిచేసిన అలతలో ఒళ్లుమరిచి నిద్రపోతుంటే వుండిమాత్రం ఏం లాభం?

ఈ వూహ బుర్రలో మెదలగానే జగన్నాథంగారు లేచి చక్కా హాల్లోకి వచ్చేశారు. హాలుకు చుట్టూరావున్న గదుల్లో దేనిలోనూ దీపాలు వెలగడం లేదు. అందరూ నిద్రపోతున్నారన్నమాట! హాల్లో గూడా ఒక్కటే దీపం వెలుగుతోంది. నేలపైన పరిచిన బ్లాంకెట్లపైన పనిమనుషులు కొందరు అడ్డదిడ్డంగా పడుకుని నిండుగా ముసుగు పెట్టుకుని నిద్రపోతున్నారు.

పూలు వాడిపోయినా వాటి సువాసనలింకా గుమ్మగుమ్మగా గుబాళిస్తున్న ఆ హాల్లో కాసేపు కూచుందామనిపించింది జగన్నాథంగారికి!

గోడకానించి పెట్టివున్న కుర్చీని తీసుకొచ్చి ఆయన తనకు నచ్చినచోట వేసుకున్నారు.

కూర్చున్న కొద్దిసేపటి కాయనకు పెళ్లిమండపంవల్ల ఏర్పడివున్న నీడలో ఒక బెంచీ వేయబడివున్నట్టు తోచింది. దానిపైన ఒక మనిషి పడుకున్న పొలకువగూడా గోచరించింది.

కప్పుకున్న బట్ట చిన్నది. అందువల్ల ఒళ్లు ముడుచుకోక తప్పలేదు. మోచెయ్యే తలగడగా ఉపకరించింది. ఏ విధంగా చూసినా అది నిద్రపట్టడానికి అనువైన సుఖశయ్య కానేకాదు.

కామాక్షీ కళ్యాణ మహల్లో నలభై రెండు గదులున్నాయి. పరుపులు, తలగడలు ఎన్నున్నాయో లెక్కేలేదు. ఏ మాత్రం ప్రయత్నించి వుండినా ఈ మానవుడికొక పరుపు దొరికివుండేదే!

కానీ పెద్దలన్నట్టు దేనికైనా అడిగివచ్చి వుండాలిగదా!

ఇంతవరకూ తెలిసిందిగాదు. ఇక్కడ దోమల వీరవిహారంగూడా ఎక్కువగానే వున్నట్టుంది.

ఉండివుండీ ఒకదోమ అంటబొడవడంతో దురవస్థలాంటి అతడి నిద్రావస్థ మాటిమాటికీ చెదిరిపోతోంది.

అసలతడు నిద్రపోతున్నాడా అన్నదే సందేహం!

"ఏమండీ! నిద్రపట్టడంలేదా?" జగన్నాథంగారు అప్రయత్నంగానే ప్రశ్నించేశారు.

"పరవాలేదు. ఒక్క రాత్రేగదా! ఎలాగో గడిచిపోతుంది..." మొత్తానికి నిద్రమాత్రం రాదన్న నిర్ణయానికి వచ్చిన వాడిలా అతడు లేచి కూచున్నాడు. లేచి కూర్చోగానే జగన్నాథంగారు అతణ్ణి పోల్చుకున్నారు.

ఇప్పుడిక ఏదైనా మాట్లాడకపోతే బాగుండదు. మాట్లాడ్డానికి యింకొక సబ్జక్టు ఎన్నుకోడమెందుకని ఆయన ఏకంగా కూపీలాగడానికి ఉపక్రమించారు.

"ఏ వూరండీ మీది?"

ప్రాసిక్యూటరు ప్రశ్నకు జవాబు చెప్పడానికి బొత్తిగా యిష్టం లేకపోయినా, చెప్పక తప్పించుకోలేని ముద్దాయిలా అతడు ముక్తసరిగా "కొర్రపాడు" అన్నాడు.

"కొర్రపాడా! ఎప్పుడూ వినలేదే! ఏ జిల్లాలో వుంటుందండీ అది?"

అతడు జిల్లా పేరు చెప్పాడు. ఆంధ్రప్రదేశంలోని అన్ని జిల్లాలపేర్లూ జగన్నాథం గారికి తెలిసినవే! అందునా అతడిప్పుడు చెప్పినపేరు మరింత సుపరిచితం. పెళ్లికొడుకు సీతాపతి ఆ జిల్లావాడే!

ఐతే ఇతడు మగపెళ్లివారి తరఫున మనిషై వుండాలి...

ఇప్పుడిక టాపిక్ మార్చవలసిన అగత్యం ఎదురైంది జగన్నాథంగారికి!

"మీకీయేడు వానలెంత మాత్రం?"

"వానలవల్ల ఒరిగేదేమీ లేనప్పుడు అవి పడడము, పడకపోవడము రెండు ఒకటే గదండీ?"

"అంటే? మీకు వ్యవసాయం లేదా ఏమిటి?"

"ఒకప్పుడుండేది..."

"ఇప్పుడు?"

"భూమిలో చాలాభాగం అమ్ముడైపోయింది. మిగిలింది తొండలు గుడ్లుపెట్టే మెట్టనేల. అది వున్నా లేనట్టే!"

"కావచ్చు. పల్లెటూళ్ళల్లో ఎందరో రైతులు ఎన్నో కారణాలవల్ల చితికిపోతుంటారు."

'రోడ్ అండర్ రిపేర్' అన్న బోర్డును చూచి మలుపు తిరిగిన కారులా జగన్నాథంగారి ప్రశ్న ఈసారి మళ్లీ విషయాంతరంలోకి వచ్చేసింది.

"బిడ్డలున్నారు గదండీ?"

"మొత్తం అయిదుగురు. ఇద్దరాడబిడ్డలకు పెళ్ళిళ్ళు చేశాను. మగబిడ్డల్లో యిప్పుడిద్దరు మాత్రమే వున్నారు..."

"అయ్యో పాపం!"

"అబ్బే, అలాంటిదేమీలేదు. ఒకడు లెక్కకు రాకుండా పోయాడని మాత్రమే చెప్పాలి..."

"భలే గమ్మత్తుగా మాట్లాడుతారండీ మీరు! బ్లాక్‌మనీలా కొన్నకొడుకు లెక్కకు రాకుండాపోవడమేమిటి?"

"అదంతేలెండి! వాడికొక్కడికి మాత్రమే చదువు పట్టుబడుతూ వచ్చింది. చనిపోతూ తల్లిగూడా వాడెందాకా చదువుకుంటాడో అందాకా చదివించమనే కోరింది. చదువుల సంగతి మీరెరుగుదురు. ఓ కుర్రాణ్ణి చదివించడమంటే ఏనుగుకు మేత అందించినట్టే! ఏడాదికొక కయ్య అమ్మి వాడి చదువుపైన పెట్టవలసి వచ్చింది..."

"పోనీలెండి! కుర్రాడు చదువుకున్నాడుగదా ఏదైనా ఉద్యోగం దొరికితే వాడు మిమ్మల్ని సాకకపోడు..."

ఎక్స్ నవ్వాడు– "ఈ దేశంలో మహరాజులు బీదవాళ్లని సాకుతున్నారు. నౌకర్లని సాకుతున్నారు. కడకు బిచ్చగాళ్లనిగూడా సాకేస్తున్నారు. ఒక కొడుకు తండ్రిని సాకడంలో

విద్దూరం లేదు. కానీ తండ్రులందరికీ అలాంటి అదృష్టం పడుతుందంటారా? నాకూ అరవయ్యేళ్లు వచ్చేశాయి. ఇప్పటిదాకా ఒకరి మోచేతి గంజికోసం కక్కుర్తి పడలేదు. మిగిలిన కొద్ది రోజులుగూడా యిలాగే గడిచిపోతాయి..."

"అయ్యో పాపం! మీ మనసుకేదో పెద్ద గాయమే తగిలినట్టుంది..."

అతడు పైకిలేచి బెంచీని జగన్నాథంగారికి దగ్గరగా జరుపుకున్నాడు. జేబులోనుంచీ బాగా నలిగిపోయిన కాగితం ఒకటితీసి ఆయనచేత పెట్టాడు.

"ఏమిటండీ యిది?"

"ఇది వాడి పెళ్లి పత్రిక, పెళ్లి అయిదురోజుల్లో వుందనంగా నాకందింది..."

"నా కెందుకు చూపిస్తున్నారో..."

"దాన్ని చదువుకునేటంతవరకూ చదువుకున్న వాణ్నిగాను. పైగా యింగ్లీషులో వుందాయె! ఎన్నిసార్లో తీసి చూసుకున్నాను. ఎందరికో చూపించాను. ఎందరికి చూపించినా ఎన్నిసార్లు చదివించుకున్నా ఈ పెళ్లికొడుకు నా కొడుకే ననుకోడానికి యిందులో ఎక్కడా దాఖలా లేదు..."

తెల్లబోతూ జగన్నాథంగారు ఆ ముసలివాడి ముఖంలోకి చూచారు. ఇదేమిటో అంతులేల్చుకోవలసిన వ్యవహారంలాగే తోచిందాయనకు. "ఉండండుండండి. కళ్లజోడు పెట్టుకుని దీనివైనమేమిటో తెలుసుకుంటాను..." అన్నారు.

ఇంతలో నటేశయ్యరు దగ్గరినుంచీ పిలుపొచ్చింది. ఫస్టురౌండు కాఫీ సిద్ధమైపోయిందట! మొదటికప్పు జగన్నాథంగారికేనంటే ఆయనకోసం ఎవరో పరుగెత్తుకొచ్చారు.

ముఖం కడుక్కుని కాఫీ సేవించాక ఆయనకు గుప్పిట్లో ఓ కాగితం నలిగిపోతున్న విషయం జ్ఞప్తికి వచ్చింది.

కళ్లజోదును అక్కడికే తెప్పించుకుని పొట్లంలా మడిగిపోయివున్న కాగితాన్ని విప్పి ఆయన కంటికెదురుగా పట్టుకున్నారు.

వరుడిపేరు కంటబడేసరికి త్రుళ్ళిపడ్డారు జగన్నాథంగారు. కన్యాదాతపేరు కనిపించేసరికి బుర్రగిర్రున తిరగసాగింది. వధువుపేరు దగ్గరికొచ్చేసరికి సందేహానికి తావులేకుండా విషయం రూఢిగా తెలిసిపోయింది.

సదరు ఆహ్వానపత్రికను స్థూలంగా యిలా తెనుగులోకి అనువదించవచ్చు...

'ఫలానా తేదీన ఫలానాచోట జగన్నాథంగారి అమ్మాయి ప్రసూనతో జరుగనున్న నా వివాహానికి విచ్చేయ గోరుతున్నాను. ఇట్లు సీతాపతి, ఎం.ఎస్సీ.'

ఒక వూరికి వెళ్లదలచుకుంటే దాని ఉనికి ఎక్కడో తెలుసుకోడం ముఖ్యం. ఉత్తరం సజావుగా చేరాలంటే చిరునామా సరిగ్గా వ్రాయడం ముఖ్యం. ఉనికి తెలియని వూళ్లకు మల్లే, చిరునామా లేని జాబులకు మల్లే కొందరు మనుషులుగూడా ఆకాశంనుంచి ఊడిపడడం సంభవమా?

అయోనిజుడైన పక్షంలో తప్పితే వరుడిలా వ్యవహరించడంలో అర్థం లేదు.

దిగాలుపడిపోయి జగన్నాథంగారు చాలాసేపటివరకూ అక్కడే కూర్చుండిపోయారు.

ఆయన మళ్లీ లేచి హాల్లోకి వచ్చేసరికి బెంచీ ఖాళీగా వుంది.

చేవమాని మొద్దుల్లాంటి యిద్దరు మనుషులెవరో ఆపాటికేవచ్చి పెళ్లి మంటపానికి వ్రేలాడుతున్న పూలదండల నన్నింటినీ తెంపి గంపల్లోకి ప్రోగుచేస్తున్నారు.

"పెళ్లయ్యా కాకమునుపే ఏమిటిది?' జగన్నాథంగారు కోపాతిరేకంతో గద్దించారు-

జగన్నాథంగారి కోపాన్ని లెక్కపెట్టకుండా వాళ్లు తమ పనేదో తాము సాఫీగా చేసుకపోసాగారు. లేదంటే ఆ యిద్దరిలో ఒక్కడుమాత్రం సహేతుకంగా సమాధానంచెప్పి ఆయన కోపాన్ని చల్లార్చడానికొక ప్రయత్నం మాత్రం చేశాడు-

"మరో పెళ్లివారు రాబోతున్నారండీ బాబుగారు! ఆలోగా ఈ పని జరిగిపోవాలి..."

రెండోవాడందుకున్నాడు. "వీటికిక్కడ కాంట్రాక్టుదారులం మేమేనయ్యా! పూల ఎరువు బలే సత్తువలెండి! ఏ పైరుకు వేసినా పంట యిబ్బడి ముబ్బడే!"

❖ భారతి - ఫిబ్రవరి 1971. ❖